సాక్షి విశాఖపట్నం

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



పాలిటెక్నిక్‌తో ఉపాధి గ్యారంటీ

పాలిసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఉపాధి పొందే కోర్సుల నిర్వహణతో విద్యార్థుల నుంచి ఆదరణ లభిస్తోంది. 8లో



దివ్యాంగ సురక్షపై అవగాహన

దిశ యాప్‌కు కొనసాగింపుగా దిశ దివ్యాంగ సురక్ష అందుబాటులోకి వచ్చిందని పోలీస్ కమిషనర్ రవిశంకర్ అన్నారు. 8లో



'ఉక్కు'లో బయోమెట్రిక్ వివాదం

బయోమెట్రిక్ అంశం స్టీల్‌ప్లాంట్‌లో వివాదానికి దారి తీసింది. డైరెక్టర్ చాంబర్‌ను కార్మిక నాయకులు ముట్టడించారు. 8లో

న్యూస్‌రీల్

నేడు సీఎం విశాఖ రాక



మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం విశాఖ రానున్నారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి.. మధ్యాహ్నం 4.25 గంటలకు బీచ్‌రోడ్డులోని నేవల్ కోస్టల్ బ్యాటరీ వద్ద హెలిప్యాడ్‌లో దిగుతారు. 4.25 నుంచి 4.30 గంటల వరకు ప్రజాప్రతినిధులతో ఇంటరాక్ట్ అవుతారు. 4.30 గంటలకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు బయలుదేరుతారు. అక్కడ జరిగే డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు కుమారుడి వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. నూతన వధూవరులను ఆశీర్వదించి.. తిరిగి కోస్టల్ బ్యాటరీ వద్ద హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 5 గంటలకు అక్కడ నుంచి విశాఖ విమానాశ్రయానికి బయలు దేరుతారు. 5.20 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్తారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి విశాఖ విచ్చేస్తున్న సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మంగళవారం రాత్రి ఏర్పాట్లు పరిశీలించారు. కోస్టల్ బ్యాటరీ నుంచి ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకు చేపట్టే చర్యలను అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలసి పరిశీలించి అధికారులకు తగిన సూచనలిచ్చారు.

ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా సూర్యనారాయణరాజు



సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సూర్యనారాయణరాజు

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి సంస్థ నూతన చైర్మన్‌గా దాట్ల వెంకట సూర్యనారాయణరాజు నియమితులయ్యారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఈ స్థానంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఉన్నారు. కాగా సూర్యనారాయణరాజుకు 2009లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సూర్యనారాయణరాజు రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షునిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి తనకు ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ఇన్వెస్టర్స్ మీట్‌కు స్పందన



మాట్లాడుతున్న ఎన్‌బీసీసీ, స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నాన్ కోర్ ఆస్తుల విక్రయం కోసం నిర్వహించిన పెట్టుబడిదారుల సమావేశానికి మంచి స్పందన లభించింది. నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ) ఆధ్వర్యంలో విశాఖ నగరంలో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ల్యాండ్ పార్సిల్ బ్లాక్‌లు, ప్లాట్ల ఔట్‌రేట్ సేల్ కోసం సమావేశం ఏర్పాటు చేశారు. పెట్టుబడిదారులను ఆకర్షించడంతో పాటు హాజరైన పెట్టుబడిదారుల ప్రశ్నలకు స్పష్టమైన వివరణ అందజేశారు. నగరంలోని హెచ్‌బీ కాలనీలోని 11.80 ఎకరాలు, ఆటోనగర్‌లోని 2.0 ఎకరాలు, పెదగంట్యాడలోని 0.089 ఎకరాలతో కలిపి మొత్తం 13.89 ఎకరాల విస్తీర్ణంలో వేర్వేరు ప్లాట్లు, బ్లాకుల రిజర్వు ధర గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌బీసీసీ జీఎం జి.రాజారామ్, స్టీల్‌ప్లాంట్ సీజీఎం జి.గాంధీ, ఎన్ఎల్ఎంసి జీఎం రోహిన్‌తో పాటు పెట్టుబడిదారులు, బ్యాంకర్లు, బిడ్డర్లు, డెవలర్లు, క్రెడాయ్‌తో సహా వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వి క్రాంత్.. క్రమాదిత్య శాఖ



ఐఎన్ఎస్ విక్రాంత్‌పై జరిగిన ముగింపు వేడుకల్లో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు



సీ ఫేజ్ విన్యాసాలు

ఈ మూడు భారత దేశ అద్భుతాలే..

- వివిధ దేశాల ప్రతినిధుల ప్రశంసలు
- ఘనంగా మిలాన్-2024 ముగింపు వేడుకలు
- విక్రాంత్ యుద్ధ విమాన వాహక నౌకపై వీడ్కోలు సమావేశం

సాక్షి, విశాఖపట్నం : భారత నౌకాదళానికి యుద్ధ విమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ఎంత విలువైనవో.. తూర్పు తీరానికి విశాఖపట్నం నగరం అంతే విలువైందని.. వివిధ దేశాల ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపించారు. విశాఖ వేదికగా.. ఈ నెల 19 నుంచి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సహకారంతో భారత నౌకాదళం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిలాన్-2024 వేడుకలు మంగళవారం ముగిశాయి. 51 దేశాలు పాల్గొనగా.. మిలాన్ చరిత్రలో ఇదే అతి పెద్దదిగా రికార్డు నెలకొల్పింది. సీ ఫేజ్ విన్యాసాలు చివరి రోజున.. విశాఖ సముద్ర జలాల్లో ఒళ్లు గగుర్పొడిచేలా యుద్ధ విన్యాసాలు నిర్వహించారు. భారత్‌కు చెందిన యుద్ధ విమానాలు, జలాంతర్గాములు, యుద్ధ నౌకలు సహా 35 యూనిట్స్ ఈ విన్యాసాల్లో పాల్గొనగా.. వివిధ దేశాలకు చెందిన 13 యుద్ధ నౌకలు, ఎయిర్‌క్రాఫ్ట్ కూడా భాగస్వామ్యమయ్యాయి. భారత నౌకాదళానికి చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ షిప్స్ ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. షిప్‌ని ఆక్రమించుకున్న సముద్రపు దొంగల బారి నుంచి ఎలా రక్షించాలనే అంశాలపై జరిగిన విన్యాసాలు హైలెట్‌గా నిలిచాయి. సముద్ర ఉపరితలంలో మిస్సైల్స్, గన్ ఫైరింగ్‌లు, యాంటీ-ఎయిర్ షూట్‌లు, ఇండియన్ నేవీ సబ్‌మెరైన్‌లతో అధునాతన యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ విన్యాసాలు, ఫైటర్‌లకు వ్యతిరేకంగా వాయు రక్షణ దళాల విన్యాసాలు, ప్రయాణించే షిప్‌పై హెలికాప్టర్‌ల ల్యాండింగ్ తదితర కార్యకలాపాలతో పాటు ఇండియన్ నేవీ ట్యాంకర్ల నుంచి ఇంధనం నింపడం వంటి సీమాన్ షిప్ విన్యాసాలు జరిగాయి. మిలాన్ ముగింపు వేడుకల్ని ఐఎన్ఎస్ విక్రాంత్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌పై నిర్వహించారు. వివిధ దేశాల కమాండింగ్ అధికారులు తుది సమావేశంలో పాల్గొన్నారు. విశాఖ నగరం అద్భుతంగా ఆతిథ్యమిచ్చిందని పలు దేశాల ప్రతినిధులు కొనియాడారని తూర్పు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.



బాబోరా.. మజాకా

- ఫిరాయింపుదారులపై చంద్రబాబు ట్రిక్స్
- అదే బాటలో దత్తపుత్రుడు పవన్ కల్యాణ్
- అడకత్తెరలో పోకచెక్కలా వైఎస్సార్ సీపీ నుంచి వెళ్లిన వారి పరిస్థితి
- తొలి జాబితాలో ఒక్కరి పేరూ లేకుండా చేసిన బాబు ద్వయం
- దాడి, పంచకర్ల, వంశీకృష్ణ, కార్పొరేటర్లకు హ్యాండిచ్చినట్లేనా.?
- చంద్రబాబు గురించి తెలిసి కూడా మోసపోయామంటూ నేతల ఆక్రోశం
- తమ రాజకీయ భవిష్యత్ నాశనమైపోయినట్లేనంటూ ఆవేదన



సాక్షి, విశాఖపట్నం :

'సార్.. పార్టీలో చేరితే టికెట్ కన్ఫర్మ్ అన్నారు.. మీరు సీనియర్లు కదా.. మీకే ఫస్ట్ ప్రయారిటీ అని చెప్పారు.. కానీ.. ఫస్ట్ లిస్ట్‌లో మా పేర్లు కనిపించలేదెందుకు..?'

చెప్పాను కదా.. మీరు సీనియర్లు అని.. ఆ మూలన నిల్చోండి.. మీ సంగతి తర్వాత చూద్దాం..

ఇదీ సంగతి..

''వైఎస్సార్ సీపీలో అత్యుత్తమ పదవులు అనుభవించారు. పోటీ చేసిన ప్రతిసారీ ఓడిపోయినా.. చట్టసభలకు పంపించారు. రాజకీయ భవిష్యత్‌కు అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అయినా ఇంకా ఏదో ఆశించారు. పరుగెత్తి పాలు తాగేద్దాం అనేలా.. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ వ్యామోహంలో పడిపోయారు. సీనియర్లుగా మనకు పెద్ద పీట వేస్తారని ఊహల్లో తేలిపోయారు. ఇక ఇక్కడ మేం ఏం చెప్తే అదే జరుగుతుంది.. మన ప్రాంతాన్ని మనమే శాసించే స్థాయికి ఎదిగిపోతున్నామని పగటి కలలు కన్నారు''. కానీ.. ఆ కలలన్నీ చంద్రబాబు వెన్నుపోటుతో పటాపంచలైపోయాయి. శాసిస్తామనుకున్న వాళ్లంతా.. సైడ్ క్యారెక్టర్స్‌గా మారిపోయారు.

కార్పొరేటర్లదీ అదే బాధ

దక్షిణ టికెట్ నాదేనంటూ.. 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు జనసేనలో చేరిన మొదటి రోజు హడావిడి చేశారు. తర్వాత ఇప్పుడు ఎక్కడున్నారో కూడా తెలియని స్థితికి చేరుకున్నారు.

దక్షిణ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి నేనే నంటూ వెళ్లిన 39వ వార్డు కార్పొరేటర్ సాధిక్‌ది కూడా అదే పరిస్థితి. అదేవిధంగా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం కల్పిస్తే.. కుళ్లు రాజకీయాలతో పార్టీకి రాజీనామా చేసిన సీతంరాజు సుధాకర్ పరిస్థితి ఎడారిగా మారింది. ఏ పార్టీలోకి వెళ్లినా సీటు లేదంటూ తరిమేస్తుండటంతో తన రాజకీయ భవిష్యత్‌కి ఎండ్ కార్డ్ పడిందంటూ వాపోతున్నారు.

పంచకర్లకు కుంపటి

వైఎస్సార్ సీపీలో చేరిన వెంటనే విశాఖ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించి.. పంచకర్ల రమేష్‌బాబుకు వైఎస్ జగన్ సముచిత స్థానాన్ని కట్టబెట్టారు. ఈ ఎన్నికల్లోనూ సీట్ పక్కాగా ఇస్తామని కూడా హామీ ఇచ్చారు. అయినా తొందరపడి జనసేన కండువా కప్పుకున్న పంచకర్ల.. ఇప్పుడు 'గ్లాసు'లో ఇరుకున్నారు. పెందుర్తి నియోజకవర్గ బాధ్యతలు పవన్ అప్పగించడంతో గొప్పలు పోయిన పంచకర్లకు ఇప్పుడు చుక్కలు కనిపిస్తున్నాయి. సొంత పార్టీలోనే శివశంకర్ అనే కుంపటి రగులుతుండగా.. పొత్తులో భాగంగా పెందుర్తి టికెట్ పంచకర్లకు ఇస్తే ఖబడ్దార్ అంటూ టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణ అధినేతకు అల్టిమేటం జారీ చేశారు. దీంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. తొలి జాబితాలో పేరు లేకపోవడంతో పంచకర్ల అయోమయానికి గురవుతున్నారు. వైఎస్సార్ సీపీలో ఉంటే కచ్చితంగా టికెట్ వచ్చేదనీ.. ఇప్పుడు వస్తుందో రాదో అనేది డౌటేనంటూ సన్నిహితులతో వాపోతున్నట్లు తెలుస్తోంది.

కన్నీళ్లు పెట్టుకుంటున్న క్యాడర్

అన్ని విధాలా ఆదుకున్న పార్టీకి ద్రోహం చేసి.. చంద్రబాబు వలలో చిక్కుకొని విలవిల్లాడుతున్న నాయకుల వెంట ఉన్న క్యాడర్ పరిస్థితి దారుణంగా మారింది. నేతలను నమ్ముకొని వెంట నడిస్తే.. తమ భవిష్యత్‌ని కూడా వాళ్లతో పాటే రోడ్డున పడేశారంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కులం, మతం, రాజకీయం చూడకుండా.. పథకాలు అందించిన వైఎస్సార్ సీపీ బెస్ట్ అనీ.. అనవసరంగా రాజకీయ ఉచ్చులోకి తీసుకొచ్చేశారంటూ ఆవేదన చెందుతున్నారు.

'దాడి'కి రిక్త హస్తాలు

ఎన్నికల వేళ టీడీపీలోకి వెళ్లిన జంప్ జిలానీలు పరిస్థితి చూస్తే అందరికీ జాలి కలుగుతోంది. సొంత కుటుంబంలా చూసుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కాదని.. ఏరు దాటాక తెప్ప తగలేసే చంద్రబాబు, ఆయన్ని అంటకాగుతున్న పవన్ కల్యాణ్ పార్టీలో చేరిన వారంతా ఇప్పుడు డైలమాలో పడిపోయారు. సీనియర్ నేత దాడి వీరభద్రరావు కుటుంబానికి వైఎస్సార్ సీపీ సముచిత స్థానాన్ని కల్పించింది. ఈ ఎన్నికల్లో కూడా మంచి పదవులు ఇవ్వాలని భావించినా.. తొందరపడి చంద్రబాబు పంచన చేరారు. అమరావతి గ్రాఫిక్స్ మాదిరిగా.. వారికి భరోసా ఇస్తానంటూ సినిమా చూపించిన బాబు.. అనకాపల్లి టికెట్‌ని జనసేనకు అప్పగించేశారు. దీంతో దాడి కుటుంబం అయోమయంలో పడిపోయింది. పోనీ ఎంపీ స్థానమైనా ఇస్తారా అంటే.. అది కూడా జనసేన ఖాతాలోకే పంపించాలని బాబు వ్యూహం పన్నారు. దీంతో తమకు రిక్త హస్తాలు చూపించారంటూ అనుచరుల దగ్గర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలి జాబితాలో పేరు లేకపోవడంతో కుటుంబమంతా మౌనముద్రలోకి వెళ్లిపోయారు. ఫస్ట్ లిస్ట్ కంటే ముందు లోకేష్ అనకాపల్లిలో శంఖారావం నిర్వహించగా.. అన్నీ తామే అన్నట్లుగా సభలో దాడి ఫ్యామిలీ వ్యవహరించింది. అయితే వారి గురించి లోకేష్ పల్లెత్తు మాట కూడా అనకపోవడంతో అవమానంగా భావించినట్లు సమాచారం. జగనే మేలు చెప్పినట్లే చేస్తారు.. ఈయన చెప్పిన మాట ఒకటి.. చేసిన పని ఒకటి.. ఇప్పుడు ఎటూ చెందకుండా అయిపోయామంటూ సన్నిహితుల వద్ద ఆక్రోశం వెళ్లగక్కినట్లు తెలుస్తోంది. తమ రాజకీయ భవిష్యత్ ఏమిటనేది ఎటూ తేల్చుకోలేక.. అడకత్తెరలో పోకచెక్క మాదిరిగా తయారైందని దాడి అండ్ కో మదనపడుతున్నారు.

వంశీ.. ఏదో అనుకుంటే..

పార్టీ పెట్టినప్పటి నుంచి చంద్రబాబుతోనే ప్రత్యక్షంగా, పరోక్షంగా పయనిస్తూ చెట్టపట్టాలేసుకుని తిరుగుతున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కి కూడా.. బాబు లక్షణాలు వంటబట్టాయి. తనని నమ్ముకుని పార్టీలోకి వచ్చిన వారి భవిష్యత్తుని గాలిలో దీపం మాదిరిగా వదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా జనసైనికులు పవన్ పొత్తు వైఖరిని దుమ్మెత్తి పోస్తున్నారు. విశాఖలోనూ 'తూర్పా'రబడుతున్నారు. తూర్పు టికెట్ నీకే.. వచ్చేసెయ్ అంటూ వంశీకృష్ణ శ్రీనివాస్‌ను పార్టీలోకి ఆహ్వానించేశారు. 2014లో వైఎస్సార్ సీపీ తరఫున టికెట్ ఇస్తే వంశీ ఓటమి పాలయ్యారు. అయినా వైఎస్ జగన్ అక్కున చేర్చుకుని పార్టీ నగర అధ్యక్షుడిగా బాధ్యతలు ఇచ్చారు. అనంతరం జీవీఎంసీ కార్పొరేటర్‌గా అవకాశం ఇస్తే.. అతి కష్టం మీద నెగ్గుకొచ్చారు. అయినా జగన్ మాత్రం సోదరుడిలా భావించి.. ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. ఇలా అన్ని విధాలుగా వైఎస్సార్ సీపీ అండగా ఉన్నా.. ఏదో ఆశించి జనసేనలో చేరారు. తొలుత తూర్పు టికెట్ కన్ఫర్మ్ అని చెప్పి.. తర్వాత.. దక్షిణ.. భీమిలి.. గాజువాక ఇస్తామని ఎప్పటికప్పుడు మాట మార్చుతుండటంతో వంశీ ఆలోచనలో పడ్డారు. నగర అధ్యక్షుడిగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించిన వంశీ వెంట ఒక్క సీనియర్ నాయకుడు కూడా వెళ్లకపోవడంతో ఆయన సామర్థ్యమేంటో పవన్‌కి తెలిసిందనీ.. అందుకే దూరం పెడుతున్నట్లు సమాచారం.

ప్రతి 15 రోజులకు మాక్‌డ్రిల్

- వీఎంఆర్‌డీఏ అధికారులు
- ఫ్లోటింగ్ బ్రిడ్జ్ పరిశీలన



ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌పై వీఎంఆర్‌డీఏ అధికారులు

విశాఖ సిటీ: ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌ను వీఎంఆర్‌డీఏ అధికారులు మంగళవారం పరిశీలించారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా సోమవారం బ్రిడ్జ్, ప్లాట్‌ఫాం విడదీసి లంగరు వేయగా.. బ్రిడ్జ్ తెగిపోయిందని దుష్ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఆ వార్తల్లో ఎటువంటి వాస్తవం లేదని అధికారులు తేల్చి చెప్పారు. జాయింట్ కమిషనర్ రవీంద్ర, వీఎంఆర్‌డీఏ కార్యదర్శి కీర్తి, చీఫ్ ఇంజనీర్ భవాని శంకర్, ఇతర అధికారులు బ్రిడ్జ్ మీదకు వెళ్లి పరిశీలించారు. బ్రిడ్జ్ సురక్షితంగానే ఉందని, ప్రతి 15 రోజులకు ఒకసారి ఇటువంటి మాక్‌డ్రిల్ నిర్వహిస్తామని జాయింట్ కమిషనర్ రవీంద్ర స్పష్టం చేశారు. విశాఖ ఖ్యాతిని మరింత పెంచేందుకు కేరళలో విజయవంతంగా నడుస్తున్న ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌ను పరిశీలించి.. అన్ని ముందస్తు చర్యలు తీసుకొని ఇక్కడ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్ సందర్శకులకు సరికొత్త అనుభూతినిస్తుందని తెలిపారు.

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సాదర స్వాగతం



విమానాశ్రయంలో రాజ్‌నాథ్‌సింగ్‌కు మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు

గోపాలపట్నం : కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. నగరంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయం 11.30 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయన మధ్యాహ్నం 1.30 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు.

తొలిరోజు టెట్‌కు 86.80 శాతం హాజరు



బ్యాగులను భద్రపరుచుకుంటున్న అభ్యర్థులు



చినముషిడివాడ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ విజయ భాస్కర్

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్-2024) మంగళవారం ప్రశాంతంగా జరిగింది. తొలిరోజు జిల్లాలోని ఏడు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,420 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, వీరిలో 3,837 మంది హాజరయ్యారు. దీంతో 86.80 శాతం మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారులు వెల్లడించారు. టెట్ పరీక్ష నిర్వహణపై విస్తృత ప్రచారం చేయటంతో అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకున్నారు. సిబ్బంది అభ్యర్థుల హాల్ టికెట్, తగిన ధృవీకరణ పత్రాలను పరిశీలించిన తరువాతనే లోపలికి పంపించారు. పరీక్ష సజావుగా జరిగేలా అన్ని పరీక్షల కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్షల జిల్లా అబ్జర్వర్, ప్రత్యేక అధికారి బి.విజయ భాస్కర్ చినముషిడివాడ కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణ, కేంద్రంలో ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ రెండు కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మరో రెండు కేంద్రాలను తనిఖీ చేశారు. షెడ్యూల్ మేరకు మార్చి 6 వరకు పరీక్షలు జరుగుతాయి.

16న జాతీయ లోక్ అదాలత్

మహారాణిపేట : జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో మార్చి 16వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ శేషమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత మార్చి 9న ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేసినప్పటికీ మహా శివరాత్రి పర్వదినం, వరుసగా ప్రభుత్వ సెలవులు రావడంతో 16వ తేదీకి మార్పు చేసినట్లు పేర్కొన్నారు. కక్షిదారులు ఈ మార్పును గమనించి హాజరు కావాలని ఆమె కోరారు. జిల్లాలోని న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహారాలు తదితర కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో లేదా 0891 - 2560414, 2575046 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఆకాష్ అకాడమీలో అగ్ని కీలలు

- షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం
- తప్పిన పెను ముప్పు



డిజాస్టర్ రెస్క్యూ హైడ్రాలిక్ మెషీన్‌తో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



భవనం వెనుక భాగంలో ఎగసిపడుతున్న మంటలు

గాజువాక : గాజువాకలో మంగళవారం ఉదయం ఘోరం చోటుచేసుకుంది. స్థానిక ఆకాష్ అకాడమీలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో గాజువాకవాసులు ఉలిక్కిపడ్డారు. అయితే, ప్రాణనష్టం లేదని తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా చోటుచేసుకున్న ఈ సంఘటనలో కోటి రూపాయల వరకు ఆస్తినష్టం జరిగినట్టు అగ్నిమాపక అధికారులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాక మెయిన్ రోడ్ సినిమా హాల్ జంక్షన్‌లో గల ఒక కమర్షియల్ కాంప్లెక్స్‌లో బైజూస్, ఆకాష్ అకాడమీ, వైభవ్ జ్యూయలరీ సంస్థలు ఉన్నాయి. ఆ కాంప్లెక్స్‌లోని రెండో అంతస్తులోగల ఆకాష్ అకాడమీ నుంచి ఉదయం 5.30 గంటలకు దట్టమైన మంటలు ప్రారంభమయ్యాయి. గమనించిన స్థానికులు గాజువాక పోలీసులకు, పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన ఫైర్ ఫైటింగ్ టీమ్ నీటిని అగ్నికీలలపై చిమ్మినా మంటలు అదుపులోకి రాలేదు. దీంతో అధికారులు నగరంలోని వివిధ ప్రాంతాల్లోని అగ్నిమాపక కేంద్రాల నుంచి, కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి మొత్తం 7 అగ్నిమాపక శకటాలను రప్పించారు. 90 అడుగుల ఎత్తయిన డిజాస్టర్ రెస్క్యూ హైడ్రాలిక్ మెషీన్ (ఫైర్ స్ప్రింగ్‌క్లార్స్)ను తీసుకొచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఫైర్ ఫైటింగ్ టీమ్ సుమారు 4 గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేసింది. మంటలను అదుపు చేసేందుకు ఫోమ్‌ను వినియోగించారు. ఈ ఘటనలో వైభవ్ జ్యూయలరీ షోరూమ్ మినహా మిగిలిన రెండు అంతస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు ఎగసి పడటంతో చుట్టుపక్కల షాప్‌ల యజమానులు, స్థానికులు ఆందోళన చెందారు. ఆకాష్ అకాడమీ, బైజూస్ ఇన్‌స్టిట్యూట్‌లో మొత్తం ఫర్నీచర్ దగ్ధమైంది. కంప్యూటర్లు, ఏసీలు, ఫ్యాన్‌లు, డిజిటల్ స్క్రీన్‌లు కాలి బూడిదైనట్టు అధికారులు పేర్కొన్నారు.

సంస్థలు తెరిచి ఉంటే..

ఉదయం ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం తప్పిందని అటు అధికారులు, ఇటు ఆయా సంస్థల నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. వైభవ్ జ్యూయలర్స్‌లో సిబ్బంది అధిక సంఖ్యలో పనిచేస్తున్నారు. ఆకాష్ అకాడమీలో వందలాది మంది విద్యార్థులు నీట్ కోసం శిక్షణ పొందుతున్నారు. వాటిని తెరిచిన సమయంలో ఇలాంటి ప్రమాదం జరిగితే నష్టం ఊహించలేనంత ఉండేదని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి, పెదగంట్యాడ ఫైర్ ఆఫీసర్ గోపీకృష్ణ, సౌత్ ఏసీపీ త్రినాథ్, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, పలువురు జీవీఎంసీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు విమ్స్‌లో క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో బుధవారం క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నోరు, రొమ్ము, గర్భాశయ, జీర్ణ కోశ, చర్మం, ఎముకలు, ఊపిరితిత్తులు, అన్న వాహికకు సంబంధించిన క్యాన్సర్లను గుర్తించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తామన్నారు. అలాగే కిమోథెరపీ, శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తామన్నారు. ఓపీ బ్లాక్‌లో బుధవారం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిబిరం నిర్వహిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆంగ్ల భాష పరిజ్ఞానం పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న సభ్యులు

భీమునిపట్నం: భీమిలి నెప్రహా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల్లోని ఆంగ్ల పరిజ్ఞానాన్ని ఇంటర్నేషనల్ బక్లరేట్ (ఐబీ) విద్య సంస్థ ప్రతినిధులు తెలుసుకున్నారు. అంతర్జాతీయంగా ఉన్నత ప్రమాణాలున్న ఐబీ ప్రతినిధుల వద్ద విద్యార్థులు తమకున్న ఆంగ్ల భాషపై ఉన్న పట్టును వివరించారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను అభివృద్ధి చేసిన తీరును హెచ్‌ఎం శ్రీదేవి వివరించారు. విద్యార్థులకు అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని పరిశీలించారు. డీఈవో చంద్రకళ, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

999 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మంగళవారం భీమిలి, ఆనందపురంలో జరిగాయి. ఈ శిబిరాలను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. మొత్తం 999 మందికి వైద్య సేవలందించారు. గుర్తించిన కంటి రోగులకు ఉచితంగా శస్త్రచికిత్స చేసి కళ్లద్దాలు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఒకరిని వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. బుధవారం ఆటోనగర్, దేవాడ, గాజువాక, ఆదర్శనగర్, ఏఎస్ఆర్ నగర్, భవాని గార్డెన్స్, గాంధీజీ వీధి, కొబ్బరి తోట, మిథిలాపురి వుడా కాలనీ, ముత్యమాంబ కాలనీ, పాతరేసవానిపాలెం, స్వర్ణభారతి, పిఠాపురం కాలనీ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో వెల్లడించారు.

పాలిటెక్నిక్‌తో ఉపాధి గ్యారంటీ

- విశాఖ కేంద్రంగా పారిశ్రామిక అభివృద్ధి
- కార్పొరేట్ సంస్థల రాకతో పెరిగిన ఉద్యోగ అవకాశాలు
- స్కిల్ హబ్‌తో కాలేజీలకు వస్తున్న పారిశ్రామిక సంస్థలు
- 2024–25 పాలిసెట్‌కు నోటిఫికేషన్ జారీ
- జిల్లాలో 15 కాలేజీలు, అందుబాటులో 6,730 సీట్లు



విశాఖలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

విశాఖ విద్య: 2024–25 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 20 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 15 పాలిటెక్నికల్ కాలేజీలు ఉండగా, వీటిలో అన్ని బ్రాంచిలు కలిపి 17,465 సీట్లు అందుబాటులో ఉన్నాయి. విశాఖ కేంద్రంగా జరుగుతున్న పారిశ్రామికీకరణతో భవిష్యత్‌లో సాంకేతిక కోర్సులు చేసిన వారికి దండిగా ఉపాధి, ఉద్యోగాలు దక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులకు విద్యార్థుల నుంచి డిమాండ్ పెరిగింది. మూడేళ్లలో చేతికొచ్చే డిప్లమో సర్టిఫికెట్‌తో ఉపాధి లేదా ఉద్యోగం పొందటం లేదంటే, ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే అవకాశాలు ఉండటంతో విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు.

నూరుశాతం సీట్ల భర్తీపై ఫోకస్

విశాఖ నగరంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీ జిల్లాకు నోడల్ కేంద్రంగా పనిచేస్తోంది. దీనితో పాటు భీమునిపట్నం (బాలికలు), ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (విశాఖ), పెందుర్తిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కాలేజీలు ఉన్నాయి. ఇవి కాక జిల్లాలో మరో 11 కాలేజీలు ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో నిర్వహిస్తున్నారు. మొత్తంగా 6,730 సీట్లు అందుబాటులో ఉండగా, 2023–24 విద్యా సంవత్సరంలో 4006 మంది విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరారు. ప్రభుత్వ కాలేజీల్లో ఈసారి నూరు శాతం సీట్లు భర్తీ అయ్యేలా సాంకేతిక విద్యాశాఖ పక్కా కార్యాచరణతో ముందుకు వెళుతోంది.

ఎన్‌బీఏ రేసులో ప్రభుత్వ కాలేజీలు

ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఏటా వసతులు, అర్హత గల ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్ వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని సాంకేతిక విద్య అందించే కాలేజీలకు 'నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడియేషన్' (ఎన్‌బీఏ) గుర్తింపు ఇస్తోంది. ఆయా ప్రాంతాల్లో స్థానిక అవసరాలకు అనుగుణంగా కోర్సులను రీ–డిజైన్ చేసుకునేందుకు వీలుగా ఈ గుర్తింపు ఉపయోగకరంగా ఉంటుంది. జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని నాలుగు కాలేజీల్లో పెందుర్తి మినహా మిగత మూడు కాలేజీలు ఎన్‌బీ రేసులో ఉండటంతో వీటిలో చేరేందుకు విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు.

స్కిల్ హబ్‌తో చెంతకే ఉద్యోగాలు

నైపుణ్యంతో కూడిన చదువులకు పెద్దపీట వేస్తోన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పక్కా కార్యాచరణతో ముందుకువెళుతోంది. విశాఖ, పెందుర్తి, భీమునిపట్నం పాలిటెక్నిక్ కాలేజీల్లో 'స్కిల్‌హబ్' ఏర్పాటు చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో పేరొందిన పారిశ్రామిక సంస్థలు నేరుగా కాలేజీలకు వచ్చి, విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వటంతో పాటు, కోర్సు అనంతరం వారిని ఉద్యోగాల్లోకి సైతం తీసుకుంటున్నాయి. ఉపాధి గ్యారెంటీ ఏర్పాట్లతో ప్రభుత్వ కాలేజీలకు క్రేజ్ పెరిగింది.

నైపుణ్యంతో కూడిన శిక్షణ



పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులు అభ్యశించేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో మెరుగైన వసతులు ఉన్నాయి. నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇస్తున్నాం. మా పెందుర్తి కాలేజీలో మూడు పారిశ్రామిక సంస్థలు ముందస్తు ఒప్పందం చేసుకొని క్యాంపెస్ ప్లేస్‌మెంట్ ద్వారా విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. ఈ ఏడాది అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

–డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ పాలిటెక్నిక్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, విశాఖపట్నం

అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ



పాలిసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. పదో తరగతి విద్యార్హతతో ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. మా కాలేజీలో పూర్తి స్థాయిలో వసతులు, సీనియర్ ఫ్యాకల్టీ ఉన్నారు. ఎన్‌బీఏ గుర్తింపు రేసులో ఉన్నాం. ఈ సారి అన్నిబ్రాంచిల్లో సీట్లు భర్తీ అయ్యేలా అధ్యాపకులకు బాధ్యతలు అప్పగించాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

–డాక్టర్ కె.నారాయణరావు, ప్రిన్సిపాల్, విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ

'ఉక్కు'లో బయోమెట్రిక్ వివాదం

- డైరెక్టర్ చాంబర్ ముట్టడి
- కొనసాగుతున్న కార్మికుల నిరసన



డైరెక్టర్ చాంబర్‌లో చర్చిస్తున్న నాయకులు

ఉక్కునగరం: బయోమెట్రిక్ అంశం మంగళవారం స్టీల్ ప్లాంట్‌లో వివాదానికి దారి తీసింది. డైరెక్టర్ (పర్సనల్) చాంబర్‌ను కార్మిక నాయకులు ముట్టడించారు. దీంతో ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ పరిసరాల్లో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్లాంట్‌లో బయోమెట్రిక్ అమలు అంశంపై ఉక్కు యాజమాన్యం శనివారం కార్మిక నాయకులతో సమావేశమైంది. ఈ సమావేశంలో నాయకులు బయోమెట్రిక్‌కు తాము వ్యతిరేకంగా కాదని అయితే కార్మికుల వేతన సవరణ, క్యాంటీన్, టాయిలెట్లు, భద్రతా పరిస్థితులు మెరుగు వంటి సమస్యలు పరిష్కరించిన తర్వాతే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక నాయకుల డిమాండ్లను పరిగణలోకి తీసుకోకుండా యాజమాన్యం మార్చి 8 నుంచి బయోమెట్రిక్ అమలు అంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కోపోద్రిక్తులైన కార్మిక నాయకులు మధ్యాహ్నం అడ్మిన్ బిల్డింగ్‌లోని డైరెక్టర్ చాంబర్‌కు వెళ్లారు. అక్కడ బయోమెట్రిక్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో అక్కడే బైఠాయించారు. ఈ విషయం తెలిసిన కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఉక్కు అడ్మిన్‌కు చేరుకుంది. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని గేటు వద్ద అడ్డుకున్నారు. కార్మికులు అడ్మిన్ గేటు వద్ద బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గేటు బయట, డైరెక్టర్ చాంబర్ వద్ద నిరసన కొనసాగుతోంది. అర్ధరాత్రి దాటే వరకు డైరెక్టర్ చాంబర్‌లోనే కార్మిక నేతలు నిరసన వ్యక్తం చేశారు. వీరికి నైట్ షిఫ్టు కార్మికులు మద్దతు పలికారు. అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, యు. రామస్వామి, జి. గణపతిరెడ్డి, బీఎంఈ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డిఫెన్స్ అండ్ మారిటైమ్ పార్క్ ఏర్పాటుకు వినతి



కేంద్రరక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వినతి పత్రం అందజేస్తున్న చాంబర్ సభ్యులు

బీచ్‌రోడ్డు: విశాఖపట్నంలో 200 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్ఎంఈల కోసం డిఫెన్స్ అండ్ మారిటైమ్ పార్క్ ఏర్పాటు చేయాలని కేంద్రరక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సభ్యులు కోరారు. సిరిపురంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖపట్నంలో తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయం, కేంద్ర విద్యా సంస్థలైన ఐఐఎం, ఐఐపీఈ, విశాఖ పోర్టు, గంగవరం పోర్టులు ఉన్నాయన్నారు. గ్లోబల్ హబ్‌గా విశాఖను మార్చడానికి డిఫెన్స్ అండ్ మారిటైమ్ పార్క్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. చాంబర్ సభ్యులు సుధీర్, చిట్టూరి శ్రీనాథ్, కృష్ణప్రసాద్, కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

అక్కిరెడ్డిపాలెం: హత్య కేసులో నిందితుడికి న్యాయస్థానం యావజ్జీవ శిక్ష విధించింది. మంగళవారం గాజువాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాక వుడాకాలనీలో జీవీఎంసీ పంప్ వద్ద శంకబత్తుల వెంకటరమణ స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. గత అక్టోబర్ 6వ తేదీన అదే విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న అబ్దుల్ సలీం (30)ను పంప్ హౌస్‌ను క్లీన్ చేయమని కోరడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. 7వ తేదీన తిరిగి వారిద్దరి మధ్య మరోసారి గొడవ జరిగింది. అబ్దుల్ సలీమ్ తలపై వెంకటరమణ రాయితో దాడి చేశాడు. గాయపడిన వ్యక్తిని స్థానికులు గాజువాకలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు వెంకటరమణపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ జరిపిన పీపీ ఎం.పావని కేసు పూర్వాపరాలను గాజువాక 3వ ఏడీజే కోర్టు అదనపు జడ్జి జి.షణ్ముఖరావుకు సమర్పించారు. పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసు దర్యాప్తు చేసిన ఏసీపీ సీహెచ్.వివేకానంద, ఏఎస్ఐ కె.సత్యనారాయణ, పోలీస్ అధికారులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ.రవి శంకర్ అభినందించారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: బ్రహ్మపూర్ – నౌపడ సెక్షన్ పరిధిలో నిర్మిస్తున్న లిమిటెడ్ హైట్ సబ్‌వే పనుల నిమిత్తం ఈ మార్గంలో గురువారం ట్రాఫిక్ కం పవర్ బ్లాక్ తీసుకుంటున్నందున పలు రైళ్ల రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ప్రకటనలో తెలిపారు.

- భువనేశ్వర్‌లో మధ్యాహ్నం 3.20గంటలకు బయల్దేరాల్సిన భువనేశ్వర్–ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా 4.45గంటలక బయల్దేరుతుంది. హౌరాలో ఉదయం 8.35గంటలకు బయల్దేరాల్సిన హౌరా–సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ గంట పది నిమిషాలు ఆలస్యంగా 9.45గంటలకు బయల్దేరుతుంది. భువనేశ్వర్‌లో మధ్యాహ్నం 12.10గంటలకు బయల్దేరాల్సిన భువనేశ్వర్–చెన్నై సెంట్రల్(12830) ఎక్స్‌ప్రెస్ ఐదున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.35గంటలకు బయల్దేరుతుంది. విశాఖలో మధ్యాహ్నం 3.30గంటలకు బయల్దేరాల్సిన విశాఖ–డిఘా (22874) ఎక్స్‌ప్రెస్ 1.45గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.15గంటలకు బయల్దేరుతుంది. విశాఖలో మధ్యాహ్నం 3గంటలకు బయల్దేరాల్సిన విశాఖ– బ్రహ్మపూర్ (18526) ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం 5 గంటలకు బయల్దేరుతుంది.

పలు రైళ్ల నియంత్రణ...

ఈ పనుల నిమిత్తం కామాఖ్య–బెంగళూరు(12552) ఎక్స్‌ప్రెస్, ముంబయి – భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, విశాఖ–భువనేశ్వర్ (22802) ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు ఈ సెక్షన్ పరిధిలో గురువారం ఆయా స్టేషన్‌లలో 20 నుంచి 30 నిమిషాలు నియంత్రించనున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలపారు.

'దిశ' దివ్యాంగ సురక్షపై అవగాహన



ప్రియదర్శిని దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు దిశ దివ్యాంగ సురక్షపై అవగాహన కల్పిస్తున్న సీపీ

పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దిశ యాప్‌కు కొనసాగింపుగా దిశ దివ్యాంగ సురక్ష అందుబాటులోకి వచ్చిందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అన్నారు. దీనిపై ప్రతీ ఒక్కరికీ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. పెందుర్తి మండలం ఎస్ఆర్ పురంలోని ప్రియదర్శిని సర్వీస్ ఆర్గనైజేషన్ దివ్యాంగుల పాఠశాలను సీపీ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగ సురక్ష టోల్ ఫ్రీ నెంబర్ 73374 34422 ద్వారా దివ్యాంగులు ఆపదలో ఉన్నప్పుడు వీడియో కాల్, లేదా వీడియో సందేశంతో పోలీసులకు సమాచారం అందిస్తే తక్షణమే స్థానిక పోలీసులను అప్రమత్తం చేస్తామన్నారు. దివ్యాంగులు తమ సమస్యను ఎదుట వ్యక్తులకు నేరుగా చెప్పలేరు కాబట్టి సైన్ లాంగ్వేజ్ తెలిసిన నిపుణులతో కూడిన బృందాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేశామన్నారు. దివ్యాంగుల సమస్యల కోసం ప్రతీ నెల 2, 15వ తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 73374 34422 నెంబర్‌లో సైన్ లాంగ్వేజ్ నిపుణురాలను అందుబాటులో ఉంచి దివ్యాంగుల సమస్యలపై తక్షణమే స్పందిస్తామని చెప్పారు. దిశ దివ్యాంగ సురక్ష కంట్రోల్ సెంటర్‌ను పర్యవేక్షించడానికి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని నియమిస్తామని చెప్పారు. పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థులకు పలు అంశాలపై మెళకువలు చెప్పారు. సీపీ వెంట పలువురు పోలీస్ అధికారులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఆసక్తి ఉన్న రంగాల్లో యువతకు ఉపాధి శిక్షణ

మహారాణిపేట: నిరుద్యోగ యువత విద్యార్హతల మేరకు.. వారు ఆసక్తి చూపే రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించేందుకు అవసరమైన వివరాలు సేకరించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. ఇందుకు నిర్ణీత పట్టికను సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించే నేపథ్యంలో ప్రాథమిక సమావేశం జేసీ అధ్యక్షతన మంగళవారం ఆయన చాంబర్‌లో జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో నిరుద్యోగ యువతను గుర్తించి, వారి విద్యార్హతలకు తగిన ఉపాధి కల్పించేలా నైపుణ్య శిక్షణను ఇవ్వాలన్నారు. ఇందుకు యువత ఆసక్తి చూపే రంగాలు, పనిచేయ బోయే ప్రాంతాలపై వివరాలను సేకరించాలన్నారు. దీనిపై యువతకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. తొలుత గాజువాక నియోజక వర్గ పరిధిలోని నిరుద్యోగ యువత వివరాలను సేకరించాలని, తదుపరి ఆయా అధికారులు చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేస్తామన్నారు. రానున్న రెండు వారాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని జేసీ స్పష్టం చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సిహెచ్.గణపతి, సెట్విస్ సీఈవో డి.కీర్తి, నేక్ సహాయ సంచాలకుడు రవి కుమార్, జిల్లా యువజన అధికారి జి.మహేశ్వర రావు, కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎస్.మోహనలక్ష్మి పాల్గొన్నారు.

యువతి కిడ్నాప్‌నకు ఆటోడ్రైవర్ యత్నం

- ఆటో నుంచి దూకేసిన యువతి
- తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స
- టూటౌన్ పోలీసుల అదుపులో డ్రైవర్



గాయపడిన యువతి

అల్లిపురం: ఓ యువతిని ఆటోడ్రైవర్ కిడ్నాప్‌కు యత్నించగా.. ఆమె భయపడి ఆటో నుంచి దూకేసింది. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. నక్కవానిపాలెంలోని క్రాంతినగర్‌కు చెందిన కె.లహరి దొండపర్తి రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూంలో పనిచేస్తోంది. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దొండపర్తిలోని షోరూంకు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఆటో దొండపర్తి వద్దకు చేరగా.. నిలుపదల చేయమని యువతి అడిగింది. అయితే డ్రైవర్ ఆటో ఆపకుండా రైల్వేస్టేషన్ వైపు వేగంగా వెళ్లడంతో యువతి కేకలు వేసింది. డీఆర్ఎం జంక్షన్ దాటి తర్వాత ఆటో నుంచి దూకేసింది. దీంతో ఆమెకు ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స అందించిన వైద్యులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎంఎల్‌సీ కేసు నమోదు చేసిన పోలీసులు డ్రైవర్‌ను గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసు నిందితులకు ఏడాది జైలు

విశాఖ లీగల్: యజమాని ఇంట్లో బంగారు ఆభరణాలు దొంగిలించిన నేరానికి నిందితులకు ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కేవీఎల్ హిమబిందు మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ దీక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఎలా ఉన్నాయి. నిందితుడు వాసుపల్లి ఎల్లాజి కారు డ్రైవరు. యజమాని వాకాడ రాజశేఖర్ రెడ్డి ఎండాడ సమీపంలోని అపెక్స్ అపార్టుమెంట్లో ఉంటున్నారు. గత ఏడాది సంక్రాంతి సెలవులకు ఆయన తమ కుటుంబ సభ్యులతో రాజమహేంద్రవరం వెళ్లారు. ఆ సమయంలో ఇంటి తాళాలను కారు డ్రైవర్ ఎల్లాజికి ఇచ్చారు. పండగ తర్వాత రాజశేఖర్ రెడ్డి తన ఇంటికి వచ్చి, బీరువా తెరిచి చూడగా..బంగారు ఆభరణాలేవీ కనిపించలేదు. డ్రైవర్ ఎల్లాజీని అడగ్గా తనకు సంబంధం లేదని మాటదాటేశాడు. అనుమానం వచ్చిన రాజశేఖర్‌రెడ్డి ఆరిలోవ పోలీసులను సంప్రదించారు. నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ శివ దర్యాప్తు ప్రారంభించారు. ఎల్లాజీపై అనుమానం వచ్చి అతనిని అరెస్ట్ చేశారు. నగలు, ఇతర ఆభరణాలు తనకు పరిచయం ఉన్న మైలపల్లి నరసింహరాజు దగ్గర ఉంచినట్లు ఎల్లాజీ అంగీకరించాడు. పోలీసులు నరసింహరాజు కూడా అరెస్ట్ చేశారు. ఇరువురిపై సెక్షన్ 381,411 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో రెండో నిందితుడు నరసింహారాజు కూడా మూడు నెలలు జైలు, రూ.పది వేలు జరిమానా విధించారు.